పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గం

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని మార్క్స్‌భవన్‌లో జరిగిన పీడీఎస్‌యూ 20వ మహాసభల్లో పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రెడ్డి చరణ్, ఉపాధ్యక్షుడిగా సికిందర్, కార్తీక్, శివ, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, సహాయ కార్యదర్శులుగా సంజీవ్‌కుమార్, వంశీ, రాహుల్, కోశాధికారిగా సౌమ్య మరో 19 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విద్యార్థి సమస్యల పరిష్కారానికి పీడీఎస్‌యూ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలో మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బహుజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పూలే భవన్‌లో పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమ కోసం పూలే దంపతులు నిరంతరం కృషి చేశారన్నారు. బహుజన వర్గాల ప్రజలు మెజార్టీగా ఉన్న మంచిర్యాల పట్టణంలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజన్న, మల్లయ్య, రాజేశం, కొండయ్య, జయరావు, పోచన్న, సత్యనారాయణ, అశోక్, మొగిలి, లక్ష్మణ్, కైలాసం, అంజయ్య, షబ్బీర్ పాషా, రమేష్, రాజన్న, పోశన్న యాదగిరి, రవూఫ్, రాజు, కిరణ్, సాయి పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా.. బెల్ట్ షాపులు



విచ్చల విడిగా మద్యం అమ్మకాలు

కిరాణా షాపుల్లో అక్రమ నిల్వలు

ఎన్నికల వేళ పట్టించుకోని ఎంసీసీ బృందాలు

మంచిర్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. అధికారుల అలసత్వంతో రెచ్చిపోతున్న మద్యం మాఫియా గల్లిగల్లికో బెల్ట్ షాపు ఏర్పాటు చేస్తోంది. నివాస గృహాలు, చిన్న చిన్న కిరాణా షాపుల్లోనూ కావలసినంత మద్యం దొరుకుతోంది. వైన్, బార్ షాపుల్లో సమయసారిణి ప్రకారం మద్యం లభ్యమవుతుండగా బెల్టు షాపుల్లో మాత్రం 24 గంటలు అందుబాటులో ఉంటోంది. ఎప్పుడంటే అప్పుడు.. ఏ బ్రాండ్ అంటే ఆ బ్రాండ్ వైన్ షాపుల మాదిరి ఇళ్లలోనే లభ్యం అవుతోంది. కిలో మీటర్లమేర వైన్ షాపులకు వెళ్లకుండానే ఐదో, పదో ఎక్కువిస్తే ఇంటి పక్కనే దొరుకుతుండటం కొసమెరుపు.

వైన్ షాపులకు అనుబంధంగా...

మద్యం విక్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో వైన్ షాపుల నిర్వాహకులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో వైన్ షాపు పరిధిలో కనీసం 30 చొప్పున బెల్టు షాపులు అనుబంధంగా పని చేస్తున్నాయంటే అతి శయోక్తికాదు. తమ టార్గెట్లు చేరుకొనేందుకు బెల్టు షాపులను ఏర్పాటు చేయిస్తూ, అక్రమంగా మద్యం అమ్మకాలు సాగించేలా వైన్‌షాపుల నిర్వాహకులే ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వైన్ షాపుల నుంచి ఎమ్మార్పీ ధరలకు కొనుగోలు చేస్తున్న బెల్టు షాపుల నిర్వాహకులు ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ. 30 అదనంగా వసూలు చేస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. పల్లెల్లో ఎక్కడ చూసినా ప్రతి వాడలో కనీసం 10 వరకు బెల్టు షాపులు దర్శన మిస్తున్నాయి. బెల్టు షాపుల కారణంగా గ్రామాల్లోని వైన్‌షాపుల్లో కూడా గణనీయంగా మద్యం అమ్మకాలు నమోదవుతున్నాయి. పట్టణాల్లో ఒక్కో వైన్‌షాపులో సగటున నిత్యం రూ. 5 లక్షల వరకు అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

అక్రమంగా సిట్టింగ్‌లు ఏర్పాటు...

బెల్టు షాపులకు అనుగుణంగా సిట్టింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తూ మందుబాబులను నిర్వాహకులు ఆకట్టుకుంటున్నారు. రెస్టారెంట్ మాదిరిగా అప్పటికప్పుడు ఆహార పదార్థాలు తయారు చేస్తూ నిర్వాహకులు అందజేస్తున్నారు. బెల్టు షాపుల్లోనూ పోటీ పెరగడంతో తమ కష్టమర్లను ఆకర్శించేందుకు ఇళ్లలోనే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్ల మాదిరిగా బెల్టు షా పుల్లో చికెన్, మటన్, గుడ్లు, ఆమ్లేట్, తదితర ఆహార పదార్థాలను వండి వారిస్తున్నారు.

పట్టించుకోని ఎంసీసీ బృందాలు...

పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం, నామినేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభంకాగా, ఎన్నికల అధికారులు ఆంక్షలు సైతం విధించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) నిబంధనల మేరకు నగదు తరలింపును తనిఖీ బృందాలు అడ్డుకుంటున్నాయి. ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేసి మరీ నిఘా ముమ్మరం చేశాయి. రూ. 50వేలు మించి నగదును తరలిస్తే ఆధారాలు విధిగా సమర్పించాలి. లేనిపక్షంలో నగదును ఎన్నికల అధికారులు సీజ్ చేస్తున్నారు. చెక్ పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని..

(తరువాయి 7లో)

ప్రశాంత వాతావరణంలో..

ఓటు హక్కు వినియోగించుకోవాలి : డీసీపీ



శివ్వారం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

జైపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నర్వా, శివ్వారం గ్రామపంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాలను జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌తో కలిసి సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లోని సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో జైపూర్, భీమారం, శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ల సిబ్బందికి ఎన్నికల్లో పాటించాల్సిన నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. డీసీపీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు బందోబస్తు నిర్వహించాలన్నారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైపూర్, శ్రీరాంపూర్ సీఐలు నవీన్, శ్రీలత, ఎస్ఐలు శ్రీధర్, సంతోష్, లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలి

మంత్రి వివేక్‌వెంకటస్వామి



మంత్రి వివేక్ వెంకటస్వామిని సన్మానిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

చెన్నూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకట స్వామి పేర్కొన్నారు. శుక్రవారం చెన్నూరులోని క్యాంపు కార్యాలయంలో కోటపల్లి మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కోటపల్లితో పాటు పరిసర మండలాల్లో సర్పంచు అభ్యర్థుల ఎంపికపై సమగ్ర కసరత్తు కొనసాగుతుందన్నారు. పార్టీ అభిప్రాయాలను ఆధారంగా తీసుకుని మంచి నాయకత్వాన్ని ముందుకు తీసుకురావాలన్నారు. అనంతరం మంత్రిని కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవో 46ను రద్దు చేయాలి



తెలంగాణ తల్లి విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

మంచిర్యాల క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 46ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో బీసీలకు స్థానిక సంస్థలో 42 శాతం అమలు చేస్తామని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ జీవోను జారీ చేయడం సరైంది కాదన్నారు. గతంలో 22 శాతం ఉన్న రిజర్వేషన్లను 17 శాతానికి పరిమితం చేశారని విమర్శించారు. బీసీల పట్ల తీవ్ర అన్యాయం చేయడమేన న్నారు. జిల్లా మొత్తం సర్పంచ్ స్థానాలు 306 ఉండగా జనాభా ప్రాతిపదికన 155 కేటాయించిన స్థానాలు 23 జిల్లాల్లో బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ అమలు అవుతుంది కేవలం 7 శాతమేనన్నారు. వెంటనే జీవో 46 ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వెంకటయ్య, సతీష్, వేణుగోపాల్, రాజేషం గౌడ్ ఉన్నారు.

నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి: కలెక్టర్



ఇటిక్యాలలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

లక్సెట్టిపేట, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర పొందాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. లక్సెట్టిపేట మున్సిపాలిటీలోని ఇటిక్యాలలో శుక్రవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మంచినీరు, గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు సరిపడా అందుబాటు ఉంచుకోవాలన్నారు. రైతులకు సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు ప్రభుత్వం రూ.500 బోనస్ కూడా ఇస్తుందన్నారు. రైతులు కేంద్రానికి తెచ్చిన ధాన్యంను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లలో పొందుపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట తహసీల్దార్ దిలీప్‌కుమార్, కేంద్రం నిర్వాహకులు ఉన్నారు.

విద్యార్థుల చేతుల్లో దేశ భవిష్యత్

● అదనపు కలెక్టర్ చంద్రయ్య ● ముగిసిన వైజ్ఞానిక ప్రదర్శన



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో అదనపు కలెక్టర్ చంద్రయ్య, డీఈవో యాదయ్య, అధికారులు

నస్పూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లో ఉందని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. నస్పూర్ పట్టణం సీసీసీలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు శుక్రవారం ముగిసాయి. ఆయా విభాగాల్లో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఇన్‌స్పైర్ విభాగంలో 11 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి, బాల వైజ్ఞానిక ప్రదర్శనలో 28 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికైయ్యాయి. ఆయా విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందుకున్నారు. టీచర్ టీఎల్ఎం విభాగంలో ఇద్దరు ఉపాధ్యాయులు జి. శ్రీనివాస్, ఇ. మహేష్‌లు రాష్ట్ర స్థాయికి ఎంపికైయ్యారు. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య ఆయా విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు కూడా విద్యాభివృద్ధి కోసం అనేక నిధులు కేటాయించడంతో విద్యాలయాల్లో సౌకర్యాలు మెరుగు పడ్డాయన్నారు. విద్యార్థులు అయా రంగాల్లో ప్రతిభ కనబర్చి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. అం తకు ముందుగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ ముగింపు సమావేశంలో డీఈవో యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి రాజా గోపాల్, ఎంఈవో పద్మజా, ప్రైవేట్ పాఠశాల నిర్వహకులు సతీష్ రెడ్డి, సిద్ద య్య, రాజేంద్రపాణి, రామకృష్ణరెడ్డి, రామకృష్ణ, ఉపేందర్, దేవన్న పాల్గొన్నారు.

ష్యూరిటీగా ఉన్న వ్యక్తికి జైలు శిక్ష

జైపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ కేసులో నిందితుడికి ష్యూరిటీగా ఉన్న వ్యక్తికి కోర్టు రెండు నెలల జైలు శిక్ష విధించింది. పూర్తి వివరాల ప్రకారం దుబాయ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసి మోసం చేసిన కందిపట్టి మురళీపై 2020లో పోలీసులు కేసు నమోదు చేశారు. మురళీ మండలంలోని రామారావుపేట గ్రామానికి చెందిన రేగుంట రాజలింగుతో పాటు మరికొంత మంది వ్యక్తుల దగ్గర నుంచి దుబాయ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేసి మోసం చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు మురళీపై పోలీసులు కేసు నమోదు చేశారు. మురళీ కోర్టు పేషీలకు హాజరు కాకపోవడంతో చెన్నూరు కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. దీంతో పోలీసులు మురళిని అరెస్టు చేశారు. ఈ క్రమంలో బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాలకు చెందిన ఎండీ నసీర్ ష్యూరిటీతో మురళీకి బెయిల్ ఇప్పించాడు. ఈ క్రమంలో మురళీ కోర్టుకు హాజరు కాకపోవడంతో ష్యూరిటీ ఇచ్చిన ఎండీ నసీర్‌కు చెన్నూరు కోర్టు జడ్జి రవి శుక్రవారం రెండు నెలల జైలు శిక్ష విధించినట్లు జైపూర్ ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు.

గడువులోగా వచ్చిన నామినేషన్లు మాత్రమే స్వీకరించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



దండేపల్లిలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

దండేపల్లి నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థులు సమర్పించే నామినేషన్లను నిర్ణీత గడువులోగా మాత్రమే స్వీకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ల కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల సిబ్బందితో మాట్లాడి నామినేషన్ స్వీకరణపై ఆరాతీసి సూచనలు, సలహాలను ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు చేపట్టిన నామినేషన్ స్వీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈనెల 29వ తేదీన సాయంత్రం 5గంటలలోగా నామినేషన్ కేంద్రంలో ఉన్న అభ్యర్థుల నుంచి మాత్రమే నామినేషన్లు స్వీకరించాలన్నారు. 5గంటలకు నామినేషన్ కేంద్రం గేటు మూసివేసి ఎవరిని లోనికి రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. నామినేషన్ కేంద్రంలో రద్దీ లేకుండా నామినేసన్ స్వీకరణ ప్రక్రియ నిబంధనలకు లోబడి త్వరగా పూర్తి చేయాలన్నారు. మొదటి విడతలో 90 సర్పంచ్, 816 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. నామినేషన్ సమర్పించే అభ్యర్థులు, ప్రతిపాదించే వారిని మత్రమే అనుమతించాలన్నారు. అనంతరం ద్వారక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న షెడ్యూల్ తెగల బాలుర సంక్షేమ వసతిగృహం భవన నిర్మాణ పనులను సందర్శించి పనులను వేగవంతంతో నాణ్యతతో త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం నామినేషన్ల కేంద్రాలలో నామినేషన్ల వేసే అభ్యర్థులతో ఆయన ముచ్చటించారు.

రెండో రోజు భారీ స్పందన..

సెంచరీ కొట్టిన సర్పంచ్ నామినేషన్లు

వార్డు మెంబర్ కోసం 222 నామినేషన్లు



లింగాపూర్‌లో నామినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో

మంచిర్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మొదటి విడుత గ్రామ పంచాయతీల ఎన్నికల్లో రెండో రోజైన శుక్రవారం అభ్యర్థుల నుంచి భారీ స్పందన కనిపించింది. మంచిర్యాల నియోజకవర్గంలోని హాజీపూర్, లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల్లో మొత్తం 90కి సర్పంచ్ స్థానాలుగాను రెండో రోజు 100 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆయా మండలాల్లోని 816 వార్డు స్థానాలకు 222 మంది అభ్యర్థులు నామి నేషన్లు వేశారు. కాగా మొదటి విడుత నామినేషన్ల దాఖలుకు శనివారంతో గడువు పూర్తి కానుంది.

లక్సెట్టిపేట: మండలంలోని 18 గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులుగా శుక్రవారం 24మంది నామినేషన్లు వేశారు. మొదటి రోజు మండలంలోని గుల్లకోట గ్రామం నుంచి ఒకటి దాఖలు కాగా ఇప్పటి వరకు మొత్తం 25మంది అభ్యర్థులు సర్పంచ్‌గా నామినేషన్లు వేసినట్లు ఎంపీడీవో సరోజ తెలిపారు. 160 వార్డులకు తొమ్మిది గ్రామాల్లో వార్డు సభ్యుడిగా 35నామినేషన్లు వేశారు.

జన్నారం: రెండో రోజు మండలంలోని రాంపూర్‌లో 2, కవ్వాల్‌లో 1, కొత్తపేటలో 2, ఇంధన్‌పల్లిలో 4, మొర్రిగూడలో 2, తొమిది గుడిశెలపల్లిలో 1, రేండ్లగూడలో 3, దేవునిగూడలో 4, కామన్ పల్లిలో 3, మురి మడుగులో 2, కలమడుగులో 3, చింతలపల్లిలో 2, బాదంపల్లిలో 1, లింగయ్యపల్లిలో 1, పొన్కల్‌లో 1, జన్నారంలో 2, ధర్మారం, చింతగూడ, రోటిగూడ, మల్యాల, మహ్మదాబాద్‌లో ఒక్కొక్కటి మొత్తం 34 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో సర్పంచ్‌ల నామినేషన్లు 29 గ్రామ పంచాయతీలకు గాను రెండో రోజు 45 వరకు నమోదు అయ్యాయి.

వార్డు సభ్యుల నామినేషన్లలో రెండో రోజు మొత్తం 99 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎస్ఐ అనూష దగ్గ రుండి పరిశీలించారు.

దండేపల్లి: మండలంలో మొత్తం 31 గ్రామపంచాయితీలకు శుక్రవారం రెండో రోజు సర్పంచుల కోసం 34మంది, వార్డు సభ్యుల కోసం 68 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. మండలంలోని తాళ్లపేటలో 4, మాకులపేటలో 1, రాజుగూడలో 1, మ్యాదరిపేటలో 1, కోత్త మామిడిపల్లిలో 1, లింగాపూర్‌లో 1, గుడిరేవులో 2, ఆల్లీపూర్‌లో 1, లక్ష్మికాంతపూర్‌లో 2, ద్వారకలో 1, ధర్మరావుపేటలో 1, కొండాపూర్‌లో 2, వెల్లనూర్‌లో 2, కాసిపేటలో 1, నంబాలలో 2, దండే పల్లిలో 2, కర్ణపేటలో 1, నర్సాపూర్‌లో 1, కోర్విచెల్మలో 1, ముత్యం పేటలో 1, రెబ్బనపల్లిలో 1, కన్నెపల్లిలో 4, చింతపల్లిలో 1 సర్పంచుల కోసం నామినేషన్ వేశారు. రెండు రోజుల నుంచి 43 మంది సర్పంచుల కోసం, వార్డు సభ్యుల స్థానాల కోసం 77 మంది నామినేషన్లు వేసినట్లు మండల ప్రత్యేక అధికారి దుర్గప్రసాద్, ఎంపీడీవో ప్రసాద్ వెల్లడించారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి...

చెన్నూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యుదయానికి కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావుపూలే 135వ వర్ధంతిని శుక్రవారం చెన్నూరు పట్టణంలో బీసీ జేఏసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ది రమష్ యాదవ్, సాధనబోయిన కృష్ణ, రాజన్నయాదవ్, సంజీవ్, పోచన్న, శ్రీనివాస్, సమ్మయ్య, బాపు, మల్లేష్, కన్యాలాల్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని బహుజన సమాజ్‌పార్టీ జిల్లా ఇన్‌చార్జి దాగాం శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి మాట్లాడారు. నాయకులు కిరణ్‌బాబు, శంకర్, రహీం, అభిలాష్, భాస్కర్ పాల్గొన్నారు.

మందమర్రిటౌన్ : పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం పట్టణాధ్యక్షుడు చకినాల శంకర్, నాయకులు రాజన్న, సతీష్, మాయ రమేష్, పాణి, నర్సోజి, కిరణ్ పాల్గొన్నారు.

పట్టణంలోని రాష్ట్రీయ రహదారి నాలుగు రోడ్ల కూడలి వద్ద పూలే వర్ధంతిని వీహెచ్‌పీ, బీసీ ఐక్య కుల సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. వీహెచ్‌పీ జాతీయ నాయకుడు సత్యనారాయణ, వెంకటేశ్వర్‌గౌడ్, పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా కన్వీనర్ పోదారి చంద్రయ్య, నాయకులు రావుల శంకర్, నర్సయ్య, పురుషోత్తం, రాజన్న పాల్గొన్నారు.







చెన్నూరులో పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీసీ జేఏసీ నాయకులు, బెల్లంపల్లి, మందమర్రిలో నివాళులు అర్పిస్తున్న నాయకులు


రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

రెబ్బెన, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం ఆసిఫాబాద్ రోడ్డు రైల్వే స్టేషన్ సమీపంలో ఆసిఫాబాద్ పట్టణం రాజంపేటకు చెందిన దొడ్డి రాకేష్(27) అనే యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. మద్యానికి బానిసై ఆరోగ్య సమస్యతో బాధపడుతూ మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. శవ పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజీమార్గాన కేసుల పరిష్కారానికి డిసెంబరు 21వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా డిసెంబరు 2న జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయ స్థాన భవనంలో పోలీసులు, ఆబ్కారీ, అటవీ శాఖాధికారులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు, స్టాండింగ్ కౌన్సిల్ బీమా సంస్థల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, సభ్యులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించొద్దు



- ప్రభుత్వ పథకాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు బంద్
- రూ.50వేలకు మించి నగదు తరలిస్తే ఇబ్బందులు
- పల్లెల్లో అధికారుల పక్కా నిఘా

బెజ్జూరు/వాంకిడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో కోడ్ అమలు కానుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎవరు ఉల్లంఘించినా చట్టపర చర్యలు తప్పవు. ఎన్నికల కోడ్ అమలును అధికారులు పర్యవేక్షించనున్నారు. జిల్లాలో ఎన్నికలు జరిగే గ్రామాల్లో అమలు కానుండగా, ఆయా గ్రామాల్లో కొత్తగా ఎలాంటి ప్రభుత్వ పథకాలు ప్రకటించడం గానీ, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయయవద్దు. ఇప్పటికే ప్రారంభమై ఉన్న పథకాలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయి. ఎన్నికల సందర్భంగా రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నారు. ప్రతీ మండల పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్టీ బందాలు తనిఖీలు నిర్వహించనున్నాయి. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రజలు రూ.50వేలకు మించి నగదును తరలిస్తే ఇబ్బందులు ఎదురవు తాయి. తరలించే నగదుకు సంబంధించిన సరైన ఆధారాలు ఉంటే సరి, లేదంటే తనిఖీ బృందాలు పట్టుకొని సీజ్‌చేస్తాయి. ప్రజలు సాధ్యమైనంత మేర ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించడం ఉత్తమం. ఏదైనా శుభకార్యాలకు వస్తువులు కొనుగోలు చేయాల్సి వస్తే అధికారులకు తెలియజేసి ఆధారాలు చూపించాలి. జిల్లాలో ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే నగదు రైతుల బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది. అదే ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్లకు విక్రయిస్తే నగదు రూపంలో డబ్బు చెల్లిస్తారు. అయితే సంబంధిత వ్యాపారుల నుంచి సరైన ఆధారాలు తీసుకున్న తర్వాతే రైతులు డబ్బు తీసుకెళ్లాలి. అదే విధంగా ఎవరైనా పెద్ద మొత్తంలో వస్తువులు తరలించినా, నిల్వ చేసినా సరైన ఆధారాలు లేకుంటే అధికారులు సీజ్‌చేసి కేసు నమోదు చేస్తారు.

అనుమతి తప్పనిసరి..

స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎక్కడైనా, ఎవరైనా ఏదైనా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ముందుగా సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటారు. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలకు లోబడి ఖర్చు చేయాల్సి ఉంటుంది.సర్పంచ్ జనరల్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు రూ.2వేలు, రిజర్వేషనస్ స్థానాల్లో పోటీచేసే అభ్యర్థులు రూ.1000, వార్డు సభ్యులు జనరల్ స్థానాల్లో పోటీచేసే వారు రూ.500, రిజర్వేషన్ ఉన్నచోట పోటీ చేసే అభ్యర్థులు రూ.250 మాత్రమే ఖర్చు చేయాలి.

నిబంధనలకు లోబడి నడుచుకోవాలి..

సర్తాజ్‌పాషా, ఎస్సై, బెజ్జూరు



జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి నడుచుకోవాలి. ప్రజలు ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి నగదును తీసుకెళ్లద్దు. సాధ్యమైనంత వరకు ఆన్‌లైన్ లావాదేవీలను ఉపయోగించుకోవాలి. పత్రికలు, న్యూస్ చానళ్లలో వచ్చే పెయిడ్ న్యూస్‌పై ప్రత్యేక నిఘా ఉంటుంది. ప్రచారానికి సంబంధించి ముందుగా అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. అనుమతులు లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదు.

వృద్ధురాలి మెడ నుంచి గొలుసు చోరీ

కాగజ్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని ద్వారకనగర్‌లో నివాసం ఉంటున్న వీరమ్మ అనే వృద్ధురాలి ఇంట్లోకి ఓ గుర్తుతెలియని వ్యక్తి చొరబడి మెడలో ఉన్న రెండు తులాల బంగారం గొలుసును ఎత్తుకెళ్లినట్టు సీఐ ప్రేంకుమార్ తెలిపారు. ద్వారకనగర్‌లో నివాసం ఉంటున్న వీరమ్మ ఇంట్లో ఉదయం పది గంటలకు హెల్మెట్ ధరించి గుర్తు తెలియని వ్యక్తి చొరబడ్డాడని చెప్పారు. ఒంటరిగా ఉన్న వీరమ్మ గొంతును లిమి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లినట్టు తెలిపారు. వీరమ్మ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ వహీదోద్దీన్, ఎస్సై సుధాకర్, సిబ్బంది పరిశీలించారు.

రౌడీషీటర్ల ముందస్తు బైండోవర్

హాజీపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలు కాపాడేందుకు హాజీపూర్ పోలీస్ స్టేషన్ పోలీసులు చర్యలు చేపట్టారు. హాజీపూర్ గ్రామానికి చెందిన రౌడీషీటర్లు అసాధి చైతన్యకుమార్, మెట్పల్లి రవి, అలాగే వేంపల్లి గ్రామానికి చెందిన ఇతర కేసుల్లో ప్రమేయం ఉన్న మడుగుల నరసయ్య, ఆవుల రామచందర్ అనే నలుగురు వ్యక్తులను శుక్రవారం బైండోవర్ చేశారు. హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్ పాండే సమక్షంలో ఒక ఏడాది కాలవ్యవధికిగాను, నిబంధనలు అతిక్రమిస్తే ఆరు నెలల జైలు శిక్ష లేదా లక్ష రూపాయల జరిమానా విధించే షరతులతో బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో హాజీపూర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ యన్. స్వరూప్ రాజ్, కానిస్టేబుల్ పెట్టెం రాజేందర్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

భీమారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికల్ గ్రామ శివారులో శుక్రవారం పేకాటస్థావరంపై దాడి చేసి పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు భీమారం ఎస్ఐ శ్వేత అన్నారు. పేకాట ఆడుతున్నారనే సమాచారంమేరకు పేకాట స్థావరంపై దాడి చేశామన్నారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎవరైనా పేకాట ఆడితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

న్యాయం కోసం బాలిక బంధువుల ఆందోళన

ఏసీపీ ప్రకాష్ హామీతో విరమణ



సముదాయిస్తున్న ఏసీపీ ప్రకాష్, సీఐ రమణమూర్తి

దండేపల్లి నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం నంబాల గ్రామానికి చెందిన శనిగారపు శేఖర్ రజిత దంపతుల కూతురు మాహన్విత అనుమానాస్పదంగా మృతి చెందడంతో బాధితులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. నంబాల నుంచి బాధితులు, వారి బంధువులు శుక్రవారం దండేపల్లి పోలీసుస్టేషన్‌కు తరలివచ్చారు. తమకు న్యాయం చేయాలని నిందితులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. అక్కడే ఉన్న ఏసీపీ ప్రకాష్ వద్దకు వెళ్లి నిందితులను కఠనంగా శిక్షించాలని మొర పెట్టుకున్నారు. ఏసీపీ ప్రకాష్ స్పందించి నిందితులను త్వరలో నే పట్టుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ కా ర్యక్రమంలో సీఐ రమణమూర్తి, ఎస్సై తహసీనోద్దీన్ ఉన్నారు.

చోరీ కేసులో రెండేళ్ల జైలు శిక్ష

మంచిర్యాల క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించిన కేసులో రామగుండంకు చెందిన సిరిమదెట్టి రవికి రెండేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 1000 జరిమానా విధించినట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలం రాపల్లికి చెందిన తోకల మల్లమ్మ అక్టోబర్ 19, 2019లో ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో ఆటో ఎక్కింది. డ్రైవర్ పాత మంచిర్యాల సమీపంలోకి రాగానే చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి బాధితురాలిని గాయపర్చి బంగారు గొలుసును లాక్కొని వెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ బుచ్చిలింగయ్య కేసు దర్యాప్తు చేపట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి, లైజన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు సాక్షాలను ప్రవేశ పెట్టడంతో జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ మంచిర్యాల న్యాయమూర్తి నిరోష రవికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

తెగిపడిన విద్యుత్ తీగ.. తప్పిన ప్రమాదం

జైనూర్/సిర్పూర్(యు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్పూర్ (యు), జైనూర్ ఆర్ అండ్ బీ ప్రధాన రోడ్డుపై గురువారం రాత్రి కొహినూర్ వద్ద 11 కేవీ విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్ అప్రమత్తంగా ఉండడంతో ప్రమాదం తప్పింది. సిర్పూర్(యు) మండలం నుంచి జైనూర్ వైపు చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, అతడి డ్రైవర్ బైక్‌పై గురువారం రాత్రి వస్తున్నారు. ఆసమయంలో రోడ్డుపై కేవీ 11 విద్యుత్ తెగిపడి ఉన్నాయి. బైక్ సమీపంలోకి వచ్చిన సమయంలో చైర్మన్ వద్ద ఉన్న సెల్‌లో ప్రకంపనలు వచ్చాయి. దీంతో చైర్మన్ విశ్వనాథ్‌రావ్ గట్టిగా అరవడంతో డ్రైవర్ అప్రవ త్తంగా వ్యవరించడంతో ప్రమాదం తప్పింది. ఆ సమయంలో ఎన్నికల నిర్వాహణ కోసం వస్తున్న పోలీసు వాహనాన్ని ఆపి పరిస్థితిని వివరించారు. అటుగా వస్తున్న వాహనదారులను అప్రమత్తం చేశారు. విద్యుత్‌శాఖ అధికారులకు పరిస్థితి వివరించడంతో తీగను తొలగించారు.

విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాల గ్రౌండ్‌లో శుక్రవారం అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, భారతీయ క్రీడా ప్రాధికార సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఖేలో ఇండియా అస్మిత అథ్లెటిక్స్ లీగ్స్‌కు స్పందన లభించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి హాజరై పారరంభించారు. కార్యక్రమంలో శిక్షకులు నాగరాజు, మణికంఠ, లక్ష్మణ్, ఏసీఎంఓ ఉద్దవ్, జీసీడీఓ శకుంతల, షేకు, ఏటీడీఓ శివకృష్ణ, పీడీలు మీనారెడ్డి, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహిచే తెలంగాణ దీక్షా దివస్ కార్యక్రమ ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీక్షా దివస్‌కు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు , అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

జీసీసీ అభివృద్ధికి కృషి చేయాలి




పెట్రోల్‌బంక్‌లో వివరాలు తెలుసుకుంటున్న జీసీసీ డివిజనల్ మేనేజర్ సందీప్‌కుమార్

కాగజ్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ(జీసీసీ) అభివృద్ధికి కృషి చేయాలని జీసీసీ ఉట్నూరు డివిజనల్ మేనేజర్ గుడిమల్ల సందీప్‌కుమార్ అన్నారు. కాగజ్‌నగర్‌లోని జీసీసీ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. జీసీసీ తరుపున గిరిజన ప్రాంతంలో ఉన్న డీఆర్‌డీపోలను బలోపేతం చేసి, బియ్యంతో పాటు ఇతర నిత్యావసర వస్తువులు తక్కువ ధరలకే అందించాలని చెప్పారు. అవసరమైన చోట కొత్త భవనాలు నిర్మించాలన్నారు. ధాన్యం, కందులు, మొక్కజొన్న, సోయావంటి పంటల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్‌బంకును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మేనేజర్ మనోహర్, అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ హేమలత, సిబ్బంది చందు, ప్రదీప్, కిష్టు, సత్యం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): జీసీసీ అభివృద్ధికి కృషి చేయాలని గిరిజన సహకార సంస్థ ఉట్నూర్ డివిజనల్ మేనేజర్ సందీప్‌కుమార్ అన్నారు. ఆసిఫాబాద్ జీసీసీ సొసైటీ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీసీసీని అభివృద్ధి చేసేందుకు సిబ్బంది, డైరెక్టర్లు కృషి చేయాలన్నారు. జీసీసీ తరపున మారుమూల గిరిజన ప్రాంతాలలో ఉన్న డీఆర్‌డీపోలను బలోపేతం చేసి బియ్యంతో పాటు ఇతర నిత్యావసర వస్తువులు తక్కువ ధరలకే అందించేలా చర్యలు తీసుకోవాలని సూచిచారు. అవసరమైన చోట కొత్త భవనాలు నిర్మించాలని, ధాన్యం, కందులు, మొక్కజొన్న, సోయా వంటి పంటల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సభ్యులు తీర్మానిచారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో గోవింద్‌చంద్ సర్దార్, సొసైటీ అకౌంటెంట్ సదాశివ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు శామ్యూల్ మాథ్యూస్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేశ్ అన్నారు. రెబ్బెన మండలంలోని గోలేటి క్రాస్ రోడ్ వద్ద గోలేటి స్పోర్ట్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మందికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత షుగర్ టెస్ట్‌లో కాకుండా కంటి పరీక్షలు, కంటి ఆపరేషన్‌లు, రక్త పరీక్షలు తదితర వాటిని ఉచితంగా చేస్తున్నామని చెప్పారు. వాటిని ప్రజలు ఉపయోగించుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేశ్ సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మహేందర్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనం పోస్టర్లు విడుదల

శ్రీరాంపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానం సీఈఆర్ క్లబ్‌లో వచ్చే నెల 28న నిర్వహించనున్న సింగరేణి క్రీడాకారులు, కళాకారుల ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను సింగరేణి సీఎండీ ఎన్ బలరాం ఆవిష్కరించారు. ఈ నెల 30వ తేదీన కార్యక్రమం జరగాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల సమ్మేళనం వాయిదాపడినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. 30న కోల్ ఇండియా కబడ్డీ పోటీలు, డిసెంబర్ 8 నుంచి రక్షణ పక్షోత్సవాలు ఉన్నందున కార్యక్రమాన్ని డిసెంబర్ 28న ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ గూడూరి యాదిరెడ్డి, రిటైర్డ్ డీవైజీఎం(పర్సనల్) ప్రేమ్ కుమార్, సీనియర్ క్రీడాకారుడు గోవర్ధన్ పాల్గొన్నారు.

పదోన్నతుల కోసం పరీక్షలు

శ్రీరాంపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హెడ్ చైన్‌మెన్, అసిస్టెంట్ చైన్‌మెన్, మున్షీ పదోన్నతుల కోసం సింగరేణి ఉద్యోగులకు శుక్రవారం వీటీసీలో రాత, ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో పరీక్షలు పూర్తి చేయగా, డీజీఎం(ఐఈడీ) రాజన్న, ఏరియా సర్వే అధికారి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచాలి

శ్రీరాంపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎస్ఆర్‌పీ 1, ఆర్‌కే 7 గనులలో శుక్రవారం ఆయన ఉత్పత్తి, ఉత్పాదకతపై ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఎస్ఆర్‌పీ 1 గని యాభై ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా నూతన సీమ్ ప్రారంభించామన్నారు. ఇప్పటివరకు జీరో యాక్సిడెంట్ గనిగా ఉందని, ఇదే ఒరవడిని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, డీజీఎం(ఐఈడీ) రాజన్న, గని ఏజెంట్ రవి కుమార్, మేనేజర్లు ఆత్మారాం సహాని, తిరుపతి, రక్షణాధికారులు చంద్ర ముర్ము, సంతోష్‌రావు, ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, సీనియర్ పీవో సంతన్, సంక్షేమాధికారి అరుణ్ తేజ, పిట్ కార్యదర్శి దాడి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రెస్ట్‌హాళ్లకు మరమ్మతులు చేయించాలి

శ్రీరాంపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వివిధ గనులపై ఉన్న రెస్ట్‌హాళ్లకు మరమ్మతులు చేయించాలని ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్‌కు ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా విన్నవించారు. శుక్రవారం నిర్వహించిన స్ట్రక్చర్ సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. ఐకే 1ఏ గని మెయిన్ గేటు నుంచి సౌత్ బంకర్ వరకు తారు రోడ్డు నిర్మించి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో మహిళలకు రెస్ట్‌హాల్ విస్తరించాలని, జనరల్ మజ్దూర్లకు నూతనంగా నిర్మించాలని, సైట్ ఆఫీస్ దగ్గర ఉన్న మరుగుదొడ్లను విస్తరించాలన్నారు. ఏరియా వర్క్‌షాప్ మిషన్ వర్క్‌షాప్‌లో పీఓటీ క్రేన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. డివిజన్‌లోని అన్ని డిపార్ట్‌మెంట్లకు కలిపి ఒక సంక్షేమాధికారిని ఏర్పాటు చేయాలన్నారు. జీఎం కార్యాలయంలోని జీఎం సెక్షన్‌లో ఆఫీస్ సబార్డినేట్లను నియమించాలన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో కొత్త డోజర్ల అవసరం ఉందని, ఈపీ ఫిట్టర్, ఫిట్టర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, ఏజెంట్లు శ్రీధర్, రవి కుమార్, డీజీఎంలు అనిల్ కుమార్, రాజన్న, రవీందర్, మల్లయ్య, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ రమేష్‌బాబు, సీనియర్ పీవో ప్రశాంత్, సీనియర్ అసిస్టెంట్ ప్రశాంత్ రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): ఈఎస్ఐలో కాంట్రాక్ట్ కార్మికుల వివరాల నమోదుకు చర్యలు తీసుకోనున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం, బెల్లంపల్లి రీజియన్ కోఆర్డినేటింగ్ అధికారి ముని గంటి శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాల యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికు లకు మెరుగైన వైద్య సేవలు, బీమా రక్షణ, ఈఎస్ఐ సేవలు అందించేందుకు సంస్థ కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా బెల్లంపల్లి రీజియన్‌లోని కాంట్రాక్టర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈఎస్ఐ ద్వారా ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకు సైతం వైద్య సేవలు, బీమా సౌకర్యం కలుగుతుందన్నారు. నెలకు 21 వేల రూపాయల లోపు వేతనం పొందే ప్రతి కాంట్రాక్ట్ ఉద్యోగికి ఈఎస్ఐ అందిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్, ఎస్‌టీపీపీ డీజీఎం(పర్సనల్) కిరణ్ కుమార్, ఈఎస్ఐ మేనేజర్ కిరణ్, సీనియర్ పీవోలు సురేందర్, సంతన్, వెంకన్న, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్, పాల్గొన్న అధికారులు

కార్మికుల సంక్షేమానికే శాంతియాగం



కాసిపేట గనిపై హోమం నిర్వహిస్తున్న మందమర్రి జీఎం రాధాకృష్ణ దంపతులు

కాసిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గని కార్మికుల సంక్షేమం, రక్షణ కోసమే శాంతియాగం నిర్వహిస్తున్నామని మందమర్రి జీఎం రాధాకృష్ణ అన్నారు. కాసిపేట 1వ గని 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గనిపై శాంతిచండీ యాగాన్ని నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, రక్షణ , భద్రతతో కూడిన ఉత్పత్తి సాధించేందుకు శాంతి హోమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి యేడాది నిర్వహించే శాంతి హోమాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. హోమంలో జీఎం దంపతులు, కేకే గ్రూపు ఏజెంటు రాంబాబు, కాసిపేట గని మేనేజర్ సతీష్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంకీర్తన, సహస్రకార్తీక రూప ప్రణతిలు సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, పిట్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్, హెచ్ఎంఎస్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం ఈసుగాం నజ్రుల్‌నగర్ పరిధిలోని ఏరాపటు చేస్తున్న వైన్ షాప్‌ను గ్రామానికి 500 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రామ మహిళలతో కలిసి శుక్రవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు కార్తీక్, దినకర్‌లు మాట్లాడుతూ నజ్రులనగర గ్రామ పంచాయతీకి కేటాయించిన వైన్ షాప్ గతంలో పెంచికలపేట మెయిన్ రోడ్డుకు పంచశీల నగర్‌లో ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ సంవత్సరం ఇంకా 500 మీటర్ల ముందుకు జరిగి ఇండ్ల మధ్యలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వైన్ షాప్‌ను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఇళ్ల మధ్యలో వైన్స్ షాప్ ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు టీకానంద్, నిఖిల్, పద్మ, ఆనంద్, మమతా, రాణా, సుచిత్ర, లలిత, రింకు, పుష్ప, గౌరిపాల్, కణన్ సర్కార, ఆశితోష్, రంజిత్, జగదీష్, ఇంద్రజిత్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిరావాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి డిసెంబరు 3న నిర్వహించే మహాధర్నాకు తరలిరావాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రహెమాన్, సంపత్ కుమార్ కోరారు. ధర్నాకు కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రకాష్‌గౌడ్, సతీష్, వేణుగోపాల్, శ్రీనివాస్, రమేష్, సురేష్‌చారి, రాధాకృష్ణ, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

నెన్నెల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ మద్దతుతో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పట్టి వెంకటకృష్ణ అన్నారు. మండల అధ్యక్షుడు అంగలి శేఖర్ ఆధ్వర్యంలో నెన్నెలలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తల అభిప్రాయ సేకరణతో ఆశావహుల వివరాలను అధిష్టానానికి పంపించినట్లు చెప్పారు. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గూర్చి ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని కోరారు. జిల్లా నాయకులు మధు, మండల నాయకులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా చెక్‌పోస్టు తనిఖీ

తాండూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని రేపల్లెవాడ వద్ద గల అంతర్ జిల్లా చెక్‌పోస్టును శుక్రవారం మండల తహసీల్దార్ జ్యోత్స్న తనిఖీ చేశారు. వాహనాల సోదాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో అక్రమంగా మద్యం, డబ్బు రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించే వారు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు.

సెల్ టవర్ ఎక్కిన యువకుడు

జైపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన అహ్మద్ అనే యువకుడు శుక్రవారం జైపూర్‌లోని సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా అహ్మద్ మాట్లాడుతూ తన కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా దాన్ని నిర్మించడానికి స్థలం లేకపోవడంతో అధికారులు ప్రక్రియను హోల్డ్‌లో పెట్టారని తెలిపాడు. వెంటనే తనకు ఇంటి స్థలం కేటాయించాలని కోరాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శ్రీధర్ సంఘటన స్థలానికి చేరుకుని యువకునికి నచ్చ జెప్పడంతో టవర్‌పై నుంచి కిందకు దిగాడు.

దీంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటుందని, తొందరపడి ఇలాంటి చర్యలకు పూనుకోవడం సరైంది కాదన్నారు.

అధికారుల తప్పిదం అభివృద్ధికి దూరం..



- ఈ సారి కూడా రాజారం గ్రామంలో ఎన్నికలు లేనట్లే
- ఎస్సీ ఓటరు లేకున్నా.. ఎస్సీ రిజర్వుడు

వేమనపల్లి, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండలం రాజారం గ్రామంలో ఈ సారి కూడ ఎన్నికలు జరిగే అవకాశాలు లేవు. రాజారం గ్రామంలో అధిక శాతం గిరిజనులు కొంత మందిమేర బీసీలు ఉన్నప్పటికీ అధికారులు బీసీ, ఎస్టీ, రిజర్వేషన్ కాకుండా ఎస్సీ రిజర్వేషన్ కల్పించారు. ఈ గ్రామంలో ఒక్క ఎస్సీ ఓటరు కూడ లేకున్నా ఎస్సీ రిజర్వుడు చేయడంతో ఎన్నికలు నిలిచిపోనున్నాయి. 2011 జనాభా లెక్కల సమయంలో అప్పటి అధికారులు పొరపాటున అధికశాతం ఉన్న మన్నేవార్(ఎస్టీ) కులానికి బదులుగా మన్నేపోల్లు(ఎస్సీ)గా తప్పుడు లెక్కలు రాయడంతో ఎస్టీకి బదులు ఎస్సీ రిజర్వేషన్ వస్తోంది. 2019లో ఈ రాజారం గ్రామం దస్నాపూర్ గ్రామ పంచాయతీలో ఉండేది. అప్పటి అధికారులు కొత్త గ్రామ పంచాయతీల పునర్విభజనలో రాజారం గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. సుమారు 100 కుటుంబాలు ఉండే ఈ గ్రామంలో 266 ఓట్లు ఉన్నాయి. అధికశాతం 184ఓట్లు ఎస్టీ మన్నేవార్ కులస్థులయే.

కానీ ఈ మొత్తం ఓట్లన్నీ మన్నేవార్‌కు బదులుగా మన్నేపోల్లుగా లెక్కించడంతో అధికారులు ఎస్సీ రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. కానీ ఇక్కడ ఒక్క కుటుంబం కూడ ఎస్సీ వాళ్ల లేక పోవడంతో గతంలో కూడా నిలిచిపోయాయి. ప్రస్తుతం కూడా గ్రామంలో ఒక్క ఎస్సీ ఓటరు కూడ లేకపోవడంతో ఈసారి కూడ ఎన్నికలు నిర్వహించే ప్రసక్తే లేదని అధికారులు పేర్కొంటున్నారు. మళ్లీ జనాభ లెక్కలు జరిగితే తప్ప రిజర్వేషన్ మారే పరిస్థితి లేదని అధికారులు పేర్కొంటున్నారు. కానీ 6వార్డుల్లో 1, 2, 3వార్డులు ఎస్సీలకే కేటాయించగా 4వ వార్డు జనరల్ మహిళ, 5, 6 వార్డులను జనరల్‌కు రిజర్వు చేశారు. ఇందులో 3 వార్డులకు ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నప్పటికీ ఉప సర్పంచ్‌ను ఎన్నుకొని ఏం చేసుడని గ్రామస్థులు వాపోతున్నారు. సర్పంచ్ లేనప్పటికీ ఉప సర్పంచ్ ఉండి ఏం ప్రయోజనమని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఎంపీడీవో కుమారస్వామిని సంప్రదించగా 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్ ఎస్సీలకు కేటాయిస్తామన్నారు. జనగణన సమయంలో ఎస్టీలకు బదులు ఎస్సీలుగా నమోదు కావడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదికలను పంపించామని పేర్కొన్నారు.



రాజారం గ్రామ పంచాయతీ కార్యాలయం

అభివృద్ధి కుంటుపడుతోంది..

బురుస మాంతయ్య, రాజారం



తమ గ్రామానికి సర్పంచ్ లేకపోవడంతో అభివృద్ధి పనులు గ్రామంలో జరుగడం లేదు. ప్రత్యేకాధికారుల పాలన ఉన్నప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదు. జనాభా లెక్కలు చేసే అధికారులు ఎస్టీలకు బదులుగా ఎస్సీలుగా రాయడంతోనే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. జిల్లా అధికారులు స్పందించి తమ గ్రామంలో రిజర్వేషన్ మార్చి సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గోపాల్‌నగర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

తాండూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సీఐ దేవయ్య, ఎస్‌ఐ కిరణ్‌కుమార్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో వెలుతురు, ర్యాంపు, తాగునీరు, వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాలు ఎలా ఉండాలో ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. నామినేషన్ ప్రక్రియ నుంచి ఎన్నికల ఫలితాలు ప్రకించే వారకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులకు సహకరించాలన్నారు. ప్రతీ ఒక్కరు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అంతకుముందు నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు.

సమస్యాత్మక నామినేషన్ కేంద్రాల పరిశీలన

కాసిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సమస్యాత్మక నామినేషన్ కేంద్రాలను శుక్రవారం మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పరిశీలించారు. మండలంలోని దేవాపూర్, సోనాపూర్, కొండాపూర్, కోనూరు, లంబాడితండా (డీ) నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. ఈ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ప్రజలందరు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలన్నారు. సీఐ వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో విజయం మనదే..

మందమర్రిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో విజయం కాంగ్రెస్ పార్టీదేనని రాష్ట్ర ఉపాధి కల్పన, కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. మందమర్రికి చెందిన టికెట్ ఆశిస్తున్న ఆశావాహులు మంత్రిని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిశారు. మంత్రి మాట్లాడుతూ ప్రజల్లో ఆదరణ, పార్టీలో మంచి పేరున్న వారికే టికెట్లు ఇస్తామన్నారు. 90 శాతం కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. పార్టీ అభ్యర్థులు ఎవరైనా విజయం కోసం కృషి చేయాలన్నారు. అనంతరం మంత్రిని ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే మార్నింగ్ వాక్..

చెన్నూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికే మార్నింగ్ వాక్ నిర్వహిస్తున్నట్లు మంత్రి వివేక్‌వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పలు కాలనీల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి ఆయన పర్యటించారు. మంత్రి మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న డ్రైనేజీ, రోడ్డు వెడల్పు కార్యక్రమాలను యుద్ధ ప్రతిపాదికన నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. అలాగే కాలనీల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వేమనపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆత్మహత్య కేసులో నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు యంత్రాంగం అరెస్టు చేయడంలో జాప్యం చేయడంతో నిందితులు అరెస్టు కాకుండా హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారని తెలిపారు. ఈ స్టేపై బీజేపీ న్యాయవాదులు హైకోర్టులో బలంగా వాదనలు వినిపించడంతో హైకోర్టు స్టేను వెకెట్ చేసిందన్నారు. దీంతో మధుకర్ ఆత్మహత్యకు కారణమైన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేయడానికి మార్గం సుగమం అయ్యిందన్నారు. పోలీసులు వారిని అరెస్టు చేసి వారి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. గతంలో నిందితులను శిక్షిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ నిందితులతో అధికారిక కార్యక్రమాలను చేపడుతున్నారని ఇది సరైంది కాదన్నారు. ఇప్పటికైనా నిందితులను శిక్షించడానికి ఎమ్మెల్యే సహకరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, నాయకులు మధు, తిరుపతి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్


డీసీపీకి వినతి పత్రం

మధుకర్ ఆత్మహత్య కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, నాయకులు డీసీపీ భాస్కర్‌కు వినతి పత్రం అందించారు. నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

టీ-పోల్ యాప్‌తో.. అర చేతిలో సమాచారం

ఓటర్ స్లిప్ డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం
అందుబాటులో పోలింగ్ స్టేషన్ వివరాలు

నెన్నెల/కోటపల్లి నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రక్రియను సజావుగా కొనసాగించేందుకు ఈసీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. కాలానికి అనుగుణంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఓటర్లకు అవసరమైన డిజిటల్ సౌకర్యాలను కూడా అందుబాటులోకి తెస్తోంది. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వారు కొత్తగా రూపొందిచిన టీ-పోల్ మొబైల్ యాప్‌ను ఎన్నికల సంఘం కొత్తగా లాంచ్ చేసింది. ఓటర్లు ఈ యాప్ నుంచి ఈజీగా పోలింగ్ స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పోలింగ్ స్టేషన్ వివరాలను కూడా తెలసుకోవచ్చు. ఎన్నికల్లో జరిగే అవకత వకలను ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు



కూడా చేయవచ్చు. ఫిర్యాదులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో ట్రాక్ చేసి ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ఈ యాప్ ప్రస్తుతం ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంది. డౌన్‌లోడ్ చేసుకొని సేవలను పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు. యాప్ ఓపెన్ చేసిన వెంటనే డాష్‌బోర్డ్ కనిపిస్తుంది. అందులో ఓటర్ స్లిప్ డౌన్‌లోడ్, పోలింగ్ స్టేషన్ వివరాలు, గ్రీవెన్స్ అనే మూడు ఆప్షన్స్ ఉంటాయి. జీపీ ఎలక్షన్స్, జిల్లా, ఎపిక్ నంబరు (ఈసీ జారీ చేసిన ఓటరు ఐడీపై ఉంటుంది) నమోదు చేస్తే ఓటర్ స్లిప్ కనిపిస్తుంది. దాన్ని డౌన్‌లోడ్ చేసుకొని ఎన్నికల రోజు ఉపయోగించుకోవచ్చు. ఇదే విధానంలో పోలిం గ్ స్టేషన్ ఎక్కడ ఉంది. ఏ బూత్ లాంటివి కూడా తెలసుకోవచ్చు. గ్రీవెన్స్ ఆప్షన్‌లో పౌరులు అధికారులు వేరువేరుగా ఫిర్యాదులు చేయ వచ్చు. ఫిర్యాదు చేసిన వెంటనే అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని ఈసీ ప్రకటించింది.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

భీమిని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నగుడిపేటకు చెందిన సుమారు వంద మంది బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాదం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారు పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఏల్పుల రోహిత్, సీనియర్ నాయకులు కొమురయ్య, రమేష్, శేఖర్, శ్రీనివాస్, మల్లేష్, జలపతి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా..బెల్ట్‌షాపులు

(5వ పేజీ తరువాయి)

క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే వదులుతున్నారు. ఎంసీసీ పకడ్బందీగా అమలు చేస్తున్నామని చెబుతున్న తనిఖీ బృందాలు మద్యం సరఫరాను మాత్రం విస్మరిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. నిత్యం పెద్ద మొత్తంలో మద్యం వైన్ షాపుల నుంచి తరలి పోతున్నా పట్టించుకునేవారు లేరు. ఎన్నికల దృష్ట్యా ఓటర్ల ను ప్రలోభ పెట్టేందుకు కేవలం నగదు మాత్రమే ఉపయోగపడుతుందనే భావనలో అధికారులు ఉన్నట్లు కనిపిస్తోంది. పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల కోసం నామి నేషన్ల దాఖలు ప్రక్రియ అనంతరం ప్రచార సమయంలో ఓటర్లకు పంపిణీ చేసేందుకు ఇప్పటి నుంచే మద్యం తరలించి స్టాక్ పెట్టు కుంటున్నట్లు తెలుస్తోంది. మరో రెండు రోజుల్లో కొత్త మద్యం పాలసీ అమల్లోకి రానుంది. దీంతో వైన్ షాపుల యజమానులు సైతం స్టాక్ మొత్తం ఖాళీ చేసే యోచనలో ఉన్నారు. దీనికి తోడు ఎన్నికలు కలిసి రావడంతో విచ్చల విడిగా బెల్ట్ షాపులకు మద్యం పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయం అయినప్పటికీ అధికారులు మద్యం సరఫరా వైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లిప్తత కారణంగా బెల్టు షాపుల్లో పెద్ద మొత్తంలో మద్యం నిల్వలు ఉంటున్నాయి. మందుబాబులకు నేరుగా బెల్టుషాపుల్లో సిట్టింగ్ ఏర్పాటు చేస్తున్నారు. అయినా అధికారుల దృష్టికి రాకపోవడం గమనార్హం.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన

హాజీపూర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : హాజీపూర్ మండలంలోని కర్ణమామిడి, పడ్తనపల్లి గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం అదనపు కలెక్టర్ చంద్రయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, డిఎం సివిల్ సప్లై అధికారి శ్రీకళ, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్ పాండేలతో కలిసి పరిశీలించారు. సెంటర్లలో పనిచేస్తున్న సిబ్బంది, రైతులతో మాట్లాడుతూ కేంద్రాల్లో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్దాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని సమయానికి మిల్లులకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికల నియమావళిపై శిక్షణ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీవో సత్యనారాయణసింగ్

కాసిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 14న నిర్వహించే పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సిబ్బందికి శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో సత్యనారాయణసింగ్ మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి నామినేషన్‌లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీవో సఫ్దర్ ఆలీ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, సీవో రాజేందర్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికల్లోనూ నోటా...

కోటపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల్లోను నోటాకు అవకాశం కల్పించారు. ఓటు హక్కును వినియోగించుకోవడం ఓటరు బాధ్యత. పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరు నచ్చకపోతే నచ్చలేదనే అభిప్రాయం తెలిపేందుకు నన్ ఆఫ్ ది ఎబౌ (నోటా) అవకాశం కల్పించింది. 2013 వరకు ఓటర్లకు అభ్యర్థులు నచ్చకపోయినా, సరైన అభ్యర్థి పోటీలో లేరని బావించినా ఎవరికో ఒకరికి ఓటు వేయాల్సిన పరిస్థితి ఉండేది. అదే ఏడాది సెప్టెంబరు 27న దేశ అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పుతో నోటా అమలులోకి వచ్చింది. ఎన్నికల సంఘం ఈవీఎంల లో నోటా బటన్ అమర్చాక మొదటిసారిగా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, మిజోరాం శాసనసభ ఎన్నికల్లో శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి ప్రతి ఎన్నికల్లో నోటా ఉంటుంది. రాష్ట్ర పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికల నిర్వహణలోను దీన్ని పొందుపరిచారు. దీన్ని అనుసరించి ప్రస్తుతం బ్యాలెట్ విధానంలో జరిగే పంచాయతీ ఎన్నికల్లోను బ్యాలెట్ పత్రంలో చివరి గుర్తు నోటా ఉంటుంది. పోటీలో ఉన్న అభ్యర్థులు నచ్చకపోతే దీని మీద స్వస్తిక్ ముద్ర పడనుంది.

ఉంగరం..కత్తెర..బ్యాటు

- పంచాయతీ ఎన్నికలకు గుర్తులు రెడీ
- సర్పంచులకు గులాబీ, వార్డు సభ్యులకు తెలుపు బ్యాలెట్ ● చివరన నోటా గుర్తు

నెన్నెల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీలకు రహితంగా నిర్వహించే ఎన్నికలు కాబట్టి ఎన్నికల కమిషన్ పంచాయతీ ఎన్నికల కోసం ప్రత్యేకంగా కొన్ని గుర్తులను ఎంపిక చేసింది. సర్పంచులకు గరిష్టంగా 30, వార్డు మెంబర్లకు 20 గుర్తులను ఎంపిక చేశారు. బ్యాలెట్ చివరన నోటా ఉంటుంది. ఎన్నికల్లో అక్షర క్రమం ప్రకారం అభ్యర్థులకు క్రమ సంఖ్యను ప్రకటిస్తారు. ఆ సంఖ్యకు ఎదురుగా ఉన్న గుర్తే అభ్యర్థి ఎన్నికల గుర్తు. వార్డు సభ్యులకు సైతం ఇదే విధానం ఉంటుంది. బ్యాలెట్‌పై అభ్యర్థుల పేర్లు ఉండవు. పోలింగ్ కేంద్రంలో గుర్తుల ఎదుట అభ్యర్థుల పేర్లు, ఫోటోలను ఏర్పాటు చేస్తారు. ఆ వివరాల ప్రకారం అభ్యర్థి ఎన్నికల గుర్తును గుర్తుంచుకొని ఓటేయాల్సి ఉంటుంది. పైనున్న అభ్యర్థులు నచ్చక పోతే నో టాకు ఓటేసుకోవచ్చు.

గులాబీ.. తెలుపు బ్యాలెట్లు

సర్పంచుల బ్యాలెట్ గులాబీ రంగులో, వార్డు సభ్యులది తెలుపులో ఉంటుంది. సర్పంచ్ అభ్యర్థుల కోసం మొదటి గుర్తుగా ఉంగరం, కత్తెర, బ్యాటు, ఫుట్‌బాల్, హ్యాండ్ బ్యాగ్, టీవీ రిమోట్, టూత్ పేస్ట్, స్పానర్, చెత్తడబ్బా, బ్లాక్‌బోర్డు, బెండకాయ, కొబ్బరి చెట్టు, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, టీ జల్లెడ, చేతి కర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, బ్యాట్స్‌మాన్, తెర చాపతో పడవ, బిస్కట్, వేణువు, చెయిన్, చెప్పులు, బెలూన్, స్టంప్స్ లాంటి 30 గుర్తులను వరస క్రమంలో కేటాయించారు. వార్డు సభ్యులకు ప్రత్యేక సింబల్స్ ఉంటాయి. మొదటి గుర్తుగా గౌను, గ్యాస్ స్టౌవ్, స్టూల్, గ్యాస్ సిలిండర్, బీరువా, ఈల, కుండ, డిష్ యాంటేనా, గరాటా, మూకుడు, ఐస్‌క్రీమ్, గాజు గ్లాస్ తదితర 20 గుర్తులు ఉంటాయి. ఏ స్థానం నుంచి ఎందరు అభ్యర్థులుంటే అన్ని గుర్తులతో బ్యాలెట్ పేపర్లను అధికారులు సిద్ధం చేస్తారు.

S. No.	Symbols in English and Telugu	Specimen Symbol
1	Ring ఉంగరము	
2	Scissors కత్తెర	
3	Bat బ్యాట్	
4	Football ఫుట్ బాల్	
5	Lady Purse లేడీ పర్సు	

సర్పంచ్ అభ్యర్థులకు కేటాయించిన గుర్తులు ఇవే..

జీతాలు చెల్లించాలి

మంచిర్యాల క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల మున్సిపల్ కార్పోరేషన్‌లో పని చేస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికుల జీతభత్యాలను వెంటనే అందించాలని ఆ సంఘం నాయకులు కమిషనర్ సంపత్‌కు వినతి పత్రం అందించారు. డేటా అప్రూవల్ కాలేదని, జీతభత్యాలు ఆపేశారని, దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే జీతభత్యాలు అందించి కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ, నవీన్, విక్రం, పూరేల్ల హరీష్, దుర్గయ్య, పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కుష్టు వ్యాధి నిర్మూలనకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌వో అనిత, ప్రోగ్రాం ఆఫీసర్ సుధాకర్ నాయక్‌లు పేర్కొన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నోడల్ సిబ్బంది వ్యాధి అవగాహన గుర్తింపు కార్డులు నమోదు చేసి రోగుల వివరాలను నమోదు చేసి సరైన సమయంలో మందులు అందజేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 87 కుష్టు కేసులు నమోదయ్యాయని, వీరికి ఆయా ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది ద్వారా చికిత్సలు అందిస్తున్నామన్నారు. ఆరోగ్య శాఖ అధికారి రాఘవయ్య, ప్రసాద్, సకలరెడ్డి, మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, డీపీ వో ప్రశాంతి పాల్గొన్నారు.

అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ

ధర్మారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 108 అంబులెన్స్ వాహనాన్ని శుక్రవారం జిల్లాకో-ఆర్డినేటర్ కుమారస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో ఉన్న మందుల సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. పలురికార్డులను పరిశీలించారు. అత్యవసర సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోస్టల్ బ్యాంకు ఖాతాల కోసం అభ్యర్థుల పరుగులు

దండేపల్లి నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు పోస్టల్ బ్యాంకు ఖాతాలు తీసేందుకు అభ్యర్థులు పరుగులు పెడుతున్నారు. శుక్రవారం దండేపల్లి మండల కేంద్రంలో తంతి తపాల శాఖ కార్యాలయం వద్దకు పలువురు పంచాయతీ ఎన్నికలో పోటీ చేసే అభ్యర్థులు వచ్చి కొత్తగా పోస్టల్ బ్యాంకు ఖాతలను తీసుకుంటున్నారు. పోస్టల్ బ్యాంకు ఖాత తెరిచ్చేందుకు కేవలం 100 కావడంతో పరుగులు పెడుతూ ఖాతలు తీసుకుంటున్నారు. దీంతో సంబంధిత పోస్టల్ బిపిఎంలు అన్‌లైన్‌లో నమోదు చేసి పోస్టల్ ఖాతలు ఇస్తున్నారు.

స్నేహితుడి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

దండేపల్లి నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి గ్రామానికి చెందిన పానకంటి కిషన్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనిది నిరుపేద కుటుంబం కావడంతో కనీసం వైద్యం చేయించుకునే స్థోమత లేక ఇబ్బంది పడుతు న్నాడు. ఈవిషయం తెలుసుకున్న దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని చదువుకున్న 1995-96 పదో తరగతి బ్యాల మిత్రులందరు వైద్య ఖర్చుల కోసం రూ. 35వేల ఆర్థిక సాయంను శుక్రవారం అతనికి అందజేశారు. కార్యక్రమంలో బాల్యమిత్రులు కుంచె కిషన్, బొద్దుల భూమన్న, గడ్డంరామ్‌చందర్, కేఎస్ రాజు, కుంచె రామ్మోహన్, ముత్యాల రాజేందర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నామినేషన్‌లు స్వీకరించే కేంద్రాలు

కాసిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30 నుంచి సర్పంచు, వార్డు సభ్యుల నుంచి స్వీకరించే నామినేషన్‌లు కేంద్రాలను ఎంపీడీవో సత్యనారాయణసింగ్ శుక్రవారం ప్రకటించారు. కాసిపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో కాసిపేట, మామిడిగూడెం, సోమగూడెం(కే), లంబాడితంబా(కే)లకు సంబంధించిన నామినేషన్‌లు స్వీకరిస్తామని, ఈ కేంద్రంలో రిటర్నింగ్ అధికారిగా శ్రీనివాస్ వ్యవహరిస్తారన్నారు. ముత్యంపల్లి జీపీలో ముత్యంపల్లి, చిన్నధర్మారం, పెద్దనపల్లికి సంబంధించిన నామినేషన్‌లు స్వీకరిస్తామన్నారు. రిటర్నింగ్ అధికారిగా ఏఆర్‌వీ రమణారెడ్డి ఉంటారన్నారు. కోమటిచేను జీపీలో కోమటిచేను, పల్లంగూడ, బుగ్గగూడెం నామినేషన్‌లు స్వీకరిస్తామని, దీనికి రిటర్నింగ్ అధికారిగా మధుకర్ వ్యవహరించనున్నారన్నారు. కోనూరు జీపీలో కోనూరు, కొండాపూర్, తాటిగూడెంలకు సంబంధించిన నామినేషన్‌లు స్వీకరిస్తారని, రిటర్నింగ్ అధికారిగా లచ్చన్న వ్యవహరిస్తార న్నారు. ధర్మారావుపేట పంచాయతీ కార్యాలయంలో ధర్మారావుపేట, లంబాడి తండా(డీ), మల్కేపల్లి, రొట్టెపల్లిలకు సంబంధించిన నామినేషన్‌ల స్వీకరిస్తారని, రిటర్నింగ్ అధికారిగా చంద్రశేఖర్‌రెడ్డి వ్యవహరించనున్నట్లు తెలిపారు. సోనాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోనాపూర్, వెంకటాపూర్, గత్రావుపల్లికి సంబంధించిన నామినేషన్ పత్రాలు స్వీకరిస్తారని, రిటర్నింగ్ అధికారిగా వేణుగోపాల్ వ్యవహరిస్తారన్నారు. దేవాపూర్ పంచాయతీ కార్యాలయంలో దేవాపూర్, మద్దిమాడలకు సంబంధించిన వారు నామినేషన్ పత్రాలు సమర్పించాలని, రిటర్నింగ్ అధికారిగా తిరుపతి వ్యవహరిస్తారన్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

కాసిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దేవాపూర్‌కు చెందిన రౌడీషీటర్ పొట్ట శ్రీనివాస్‌ను పోలీసులు శుక్రవారం తహసీల్దార్ సునీల్‌దేశ్‌పాండే ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా దేవాపూర్ ఎస్‌ఐ గంగారాం మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రౌడీ షీటర్లను బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



- జిల్లాలో ఏళ్లుగా పూర్తి కాని ప్రాజెక్టులు
- సాగునీరు అందక రైతుల అవస్థలు
- నిర్మాణాల్లో అంతులేని జాప్యం
- పట్టించుకోని ప్రభుత్వం



అసంపూర్తిగా ఉన్న జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు

ప్రాజెక్టుల కథ.. తీరని వెత

ఆసిఫాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పంట పొలాలకు సాగునీటిని అందించే ప్రాజెక్టుల నిర్మాణంలో అంతులేని జాప్యం తీరని వెతగా మారింది. దీంతో జిల్లా రైతాంగానికి వర్షాధారమే సాగుకు దిక్కవుతోంది. ఏళ్లుగా ప్రధాన ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉండడంతో సాగులో పెద్దగా మార్పు జరగడం లేదు. సరైన సాగునీటి వసతి లేక వేలాది ఎకరాల భూమి నిరుపయోగంగా మారుతోంది. గత్యంతరం లేక ఆరుతడి పంటలనే రైతులు సాగు చేస్తున్నారు. చివరికి వానపడతే పంట లేకుంటే లేదు అన్న చందంగా రైతులు పరిస్థితి నెలకొన్నది. అన్నదాతలు పూర్తిగా వర్షాధార పంటలపై ఆధారపడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రాజెక్టు పూర్తై సక్రమంగా నీరందిస్తే తప్ప సాగు పండుగలా మారే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు ఉన్నప్పటికీ అవి పెండిం గ్‌లోనే ఉన్నాయి. ప్రధానంగా కుమరం భీం ప్రాజెక్టు, జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి కావడం లేదు. జిల్లాలోని వట్టివాగు ప్రాజెక్టు కాలువలు మరమ్మతులకు నోచుకోవడం లేదు.

పూర్తి కాని కుమరం భీం ప్రాజెక్టు..

జిల్లాలో ప్రధానమైన కుమరం భీం ప్రాజెక్టు కూడా ఏళ్లుగా రైతులకు పూర్తి స్థాయిలో సాగునీ రందించడం లేదు. పది టీఎంసీల సామర్థ్యంతో సుమారు రూ.600 కోట్లకు పైగా అంచనాలతో నిర్మితమైన ఈ ప్రాజెక్టు లక్ష్యంలో సగం కూడా నీరందించడం లేదు. కుడి ప్రధాన కాలువ ద్వారా ఆసిఫాబాద్ మండల పరిధిలో ఆరు వేల ఎకరాలు, ప్రధాన ఎడమ కాలువ ద్వారా ఆసిఫాబాద్‌తో పా టు కాగజ్‌నగర్, సిర్పూర్(టి) మండలాల్లోని 45, 500 ఎకరాలకు సాగునీటిని అందించాలని ప్రాజె క్టును రూపొందించారు. ప్రాజెక్టు ప్రధాన నిర్మాణం పూర్తై ఏళ్లు గడుస్తున్నా కాలువల పనులు పూర్తి కాకపోవడంతో ప్రయోజనం లేకుండా పోయింది.

పెద్దవాగుపై నిర్మించిన..

కాగజ్‌నగర్ మండలంలోని పెద్దవాగుపై నిర్మించి న జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు పనులు ఇంకా కొనసా గుతూనే ఉన్నాయి. కాగజ్‌నగర్, దహెగాం మండలాల పరిధి 15 వేల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో ప్రాజెక్టు నిర్మాణ పనులను చేపట్టినప్పటికీ నత్తనడకన కొనసాగుతున్నాయి. భూసేకరణ, తదితర సమస్యలతో పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రాజెక్టు నిర్మాణం పనుల్లో జాప్యంతో ఆయకట్టుదారులకు సాగునీరు అందని పరిస్థితి నెలకొన్నది. ప్రాజెక్టు నిర్మాణం చేపడితే తమ భూములు పంట పొలాలుగా మారుతాయని ఆశించిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. ప్రభుత్వం స్పందించి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయా లని రైతులు కోరుతున్నారు.

దయనీయ స్థితిలో వట్టివాగు..

ఆసిఫాబాద్ మండలం వట్టివాగు నీటిని స్థానిక పొలాలకు అందించాలనే ఉద్దేశ్యంతో 1998లో 24,500 ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. కుడి కాలువ ద్వారా 21,800 ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా 2,700 ఎకరాల ఆయ కట్టు లక్ష్యంగా ప్రతిపాదించారు. కాలువలు ప్రాజెక్టు నిర్మాణం నుంచి ఆధునీకరణకు నోచుకో వడం లేదు. దీనికి తోడు ఇప్పటికే



శిథిలమైన వట్టివాగు ప్రాజెక్టు కాలువలు

కాలువలు మొత్తం దెబ్బతిన్నాయి. లైనింగ్ కోల్పోయి చెట్లు ఏపుగా పెరిగి అధ్వానంగా మారాయి. చాలా చోట్ల కాలువలు ధ్వంసమై నామరూపాలు లేకుండా పోయాయి. దీంతో ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల పరిధిలోని ఆయకట్టు రైతులకు సాగునీరు అందించే స్థితిలో లేదు. అధి కారులు ఆధునీకరణ పనుల కోసం ప్రతిపాదనలను పంపినప్పటికీ సరి పడా నిధులు విడుదల కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు.

సర్పంచ్ స్థానాలకు 95 నామినేషన్లు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మొదటి విడత నిర్వహించే పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రెండో రోజు శుక్రవారం సర్పంచ్ స్థానాలకు 95, వార్డు సభ్యుల స్థానాలకు 110 నామినేషన్ దాఖలు అయ్యాయి. మొదటి విడతలో జిల్లాలో వాంకిడి, కెరమెరి, జైనూరు, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల్లో 114 సర్పంచ్ స్థానాలకు, 944 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఆయా మండలాల పరిధిలో 27 క్లస్టర్లను ఏర్పాటు చేసిన అధికారులు నామినేషన్లను స్వీకరిస్తున్నారు. రెండో రోజు సర్పంచ్ స్థానాలకు 95, వార్డు స్థానాలకు 110 నామినేషనట్లు దాఖలు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం రెండో రోజు సర్పంచ్ స్థానాలకు 12 నామినేషన్‌లు, వార్డు సభ్యుల స్థానాలకు 35 నామినేషన్‌లు దాఖలు అయినట్లు ఎంపీడీవో జ్యోత్స్న తెలిపారు.

నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన జాతీయ విద్యా విధానం 2020కి వ్యతిరేకంగా ఉద్యమిద్దామని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మాలి సంఘ భవనంలో జిల్లా మహాసభలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థి ఉద్యమాల దిక్సూచి పీడీఎస్‌యూ అని కొనియాడారు. ప్రగతి శీల భావజాలం వ్యాప్తి జరగాలంటే పీడీఎస్‌యూ లాంటి విప్లవ విదాయర్థి సంఘం చురుకైన పాత్ర పోషించాలని తెలిపారు. గత 50 సంవత్సరాలుగా దేశంలోని పీడిత, తడిత ప్రజల విద్యార్థుల భవిష్యతే ప్రధాన ధ్యేయంగా వారి అభివృద్ధి కోసం ప్రభుత్వ విద్యాబలోపేతం కావాలని అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, తరుణ్, సమీర్, దీపక్, మల్లేష్, వసంత్, శివప్రసాద్, నందిని, తపస్సుస్, రత్నం, పోశం తదితరులు పాల్గొన్నారు.

దళారి వ్యవస్థను ప్రోత్సహిస్తే చర్యలు

తిర్యాణి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ట్రేడ్ లైసెన్సులు లేకుండా రైతుల వద్ద నుంచి పత్తి కొనుగోలు చేస్తూ దళారి వ్యవస్థను ప్రోత్సహిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. మండల క్రేంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు ప్రభుత్వం సూచించిన విధంగా ఆన్‌లైనలో తమ పత్తి పంటను నమోదు చేసుకోవాలన్నారు. సీసీఐ కేంద్రాల్లో విక్రయించుకోవాలని సూచించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నూతన విదయ విదానాల పోకడలను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు నేర్చుకుని విద్యార్థికి గుణాత్మక విద్యను అందించాలని ఏసీఎంఓ ఉద్ధవ్, లక్ష్మయ్య అన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో ఐదు రోజులుగా ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ ముగింపు కార్యక్రమంలో శుక్రవారం వారు మాట్లాడారు. సమావేశంలో ఉపాధ్యాయులు లింగారావు, షేకు, జీవరత్నం, అమరేందర్‌రెడ్డి, మహేశ్వర్‌రావు, హరికృష్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాల పరిశీలన



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు

వాంకిడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని బెండార, వాంకిడిలోని సర్పంచ్ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను శుక్రవారం జిల్లా ఎన్నికల పరిశీలకులు శ్రీనివాస్, డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్ పరిశీలించారు. ఇప్పటి వరకు వచ్చిన నామినేషన్లు, భద్రత సదుపాయాలను పరిశీలించారు. వారి వెంట ఎంపీవో జావీద్, తదితరులు ఉన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలంలోని సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ కేంద్రాలను ఎస్సై సురేష్, తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీడీవో సత్యనారాయణలు పరిశీలించారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల నామినేషన్ కేంద్రాలను పరిశీలించి సూచనలు చేశారు.

క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వాంకిడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వాంకిడి జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ పథకంలో భాగంగా శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు నటరాజ్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ క్రీడా పోటీలు రెండు రోజుల పాటు కొనసాగుతాయని అన్నారు. బాలుర విభాగంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడలు, బాలికల విభాగంలో ఖోఖో, కబడ్డీ నిర్వహించి విజేతలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

తిర్యాణి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు పలువురు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అనిల్‌గౌడ్ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగేష్, గణపతి, అంబారావు, బొజ్జిరావు, చిన్ను, ఎం.చిన్ను, ఓనిక్‌రావు, భగవంతరావు, పత్నుబాయి, మంజుల, సూరిబాబు, బారిక్‌రావు, మధుకర్, తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యకరమంలో సాగర్, వినోద్, వెంకటేశంగౌడ్, శంకర్, తెలంగ్‌రావు, మోతిరాం, దేవదాస్, జగన్నాథ్‌రావు, హరీష్‌కుమార్, అమర్, రాజశేఖర్, రవి, బి.రవి, రంజిత్, వెంకటేష్, రాజేశం, బాపు, బాలేష్‌గౌడ్, నర్సయ్య, శంకర్, బాపు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియలో పొరపాట్లు జరుగనివ్వొద్దు



కెరమెరిలో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కెరమెరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ల ప్రక్రియలో పొరపాట్లు జరుగనివ్వొద్దని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల నామినేషన్ ప్రక్రియను అదనపు కలెక్టర్ దీపక్ తివారి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం కేస్లాగూడ గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్ల పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో సురేష్ కుమార్, ఎంపీవో సాయిరాంగౌడ్, కారదర్శి గణేశ్ పాల్గొన్నారు.

లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. మండలంలో మొత్తం 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు ఏడు నామినేషన్లు దాఖలు చేశారు. రెండో రోజు శుక్రవారం మూడు క్లస్టర్లలో కలిపి సర్పంచ్ స్థానాలకు 20 మంది నామినేషన్లు వేశారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉషేగాం నామినేషన్ క్లస్టర్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. ఈ ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల విషయాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని పట్నాపూర్, మాని జండాగూడ, పవర్ గూడ తదితర గ్రామ పంచాయతీల నుంచి సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మండల వ్యాప్తంగా ఆరు క్లస్టర్లలో వార్డు స్థానాలకు 32 మంది, సర్పంచ్ స్థానాలకు 30 మంది నామినేషన్లు వేశారని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి తెలిపారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక సంస్థలు ఎన్నికల నమినేషన్ క్లస్టర్ కేంద్రాని శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ తీరును అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. మండలంలోని మొత్తం 15 గ్రామ పంచాయతీలకుగానూ శుక్రవారం 14 మంది సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేశారని అధికారులు ఈ సందర్భంగా చెప్పారు. పకడ్బందీ ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు.

నాటు సారా స్థావరాలపై దాడి

దహెగాం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం మర్రిపల్లి గ్రామంలో శుక్రవారం నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ సీఐ రవి ఆధ్వర్యంలో ఎక్సైజ్, పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా 300 లీటర్ల బెల్లం పానకం, 20 లీటర్ల గుడుంబా,ఒక ద్విచక్ర వాహనం స్వాధీన పర్చుకున్నారు. గ్రామానికి చెందిన జర్పుల లలిత, జర్పుల పద్మ, బదావత్ రజితలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో సీఐ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

బెజ్జూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బారెగూడ గ్రామంలో శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ రామ్మోహన్ ప్రారంభించారు. ధాన్యం 17 శాతం కంటే తక్కువ తేమ ఉండాలని, ధాన్యాన్ని ఆరబెట్టి తరు వాత కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నారు. కార్యక్రమంలో డీటీ బీమ్లా నాయక్, ఏపీఎం మోహన్‌దాస్, వీవో అధ్యక్షురాలు శ్రీదేవి, సీసీ రంగయ్య, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి



కెరమెరిలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు సుగుణ

కెరమెరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని డీసీసీ అధ్యక్షురాలు సుగుణ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తాను ఇతర ప్రాంత వాసి అని కొందరు పని కట్టుకుని ప్రచారం చేస్తున్నారని చెప్పారు. తాను ఈ ప్రాంతంలోనే సిర్పూర్(యూ) మండలంలో పుట్టి పెరిగి అక్కడ, ఇక్కడ ఉద్యోగం చేశానని గుర్తచేశారు. ఈ ప్రాంత వాసితోనే వివాహం జరిగిందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి స్థానిక ఎన్నికలలో అభ్యర్థుల విజయానికి వర్గవిభేదాలు, కులానికి తావు లేకుండా పార్టీ అభ్యర్థుల విజమానికి కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనా యక్, నాయకులు శంకర్‌నాయక్, కుసుమ్‌రావు, ఎల్లప్ప, రజాక్, సుజాయిద్, మారుతి, గిడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ఆధ్వర్యంలో మండలంలోని పారా, పొచంలొద్ది, సుకుడ్‌పెల్లి, కొండాపటార్ తదితర గ్రామాల బీఆర్ఎస్ నాయకులు పార్టీలోచేరగా కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పొచంలొద్ది మాజీ సర్పంచ్ మడావి మనోహర్, నగేష్ పటేల్ (పారా), లంకేష్, సోయం పైకు, కుంర లక్ష్మణ్, కుంర భుజంగ్‌రావ్, మడావి శ్రీ కాంత్, ఆత్రం కన్ను, మేస్రాం మారు,షేక్ మాజర్, సయద్ జుబెర్, సయద్ అజర్, అర్షద్ ఖాన్, సయద్ వసీం, ,సయద్ ఉస్మాన్, షేక్ ఇస్మాయిల్, సల్మాన్ ఖాన్, రహీం, తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మండలఅధ్యక్షులు అబ్దుల్ ముకీద్ తెలిపారు. గ్రామాల్లో కాంగ్రెస్‌ను బలోపేతనం చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉడకని అన్నం పెడుతున్నారని విద్యార్థుల నిరసన



కౌటాలలో భోజనం ప్లేట్లతో రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

కౌటాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉడకని అన్నం.. నీళ్ల చారుతో కడుపునిండా తినలేక పస్తులు ఉంటున్నామని కుమరం భీం జిల్లా కౌటాల మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు శుక్రవారం నిరసన చేపట్టారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు నాణ్యమైన బోజనం పెట్టడం లేదని ప్రధాన రహదారిపై బైఠాయించారు. కొన్ని రోజులుగా తమకు నాణ్యమైన బోజనం అందించడం లేదని, పలుమార్లు చెప్పినా తీరు మారడం లేదని విద్యార్థులు తెలిపారు. రోడ్డుపైనే అన్నం వడ్డించిన పేట్లతో బైఠాయించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ప్రమోద్, ఎస్సై చంద్రశేఖర్, ఎంఈవో హనుమంతు అక్కడికి చేరుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా వారు వినలేదు. అధికారులు విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్లి సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చాలా సమస్యలు ఉన్నాయని విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లిపోయారు.

జ్యోతిబాపూలేకు ఘన నివాళి



వాంకిడిలో నినాదాలు చేస్తున్న మాలి, అంబేద్కర్ సంఘం నాయకులు



కెరమెరిలో నివాళులు అర్పిస్తున్న మాలి సంఘం నాయకులు

ఆసిఫాబాద్/కెరమెరి/వాంకిడి/రెబ్బెన, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయా సంఘాల నాయకులు పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 15ఏఎస్ఎఫ్28: జిల్లా కేంద్రంలో శుక్రవారం బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ రమేష్ ఆధ్వ ర్యంలో జ్యోతిబాపూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశవరావు, మారుతి, మెంగాజీ, న్యాయవాది రవీందర్, శంకర్, బాబురావు, శ్యాం, షేక్ అసాద్, జలపతి, తిరుపతి, రాందేవ్, వెంకన్న, పాల్గొన్నారు. కెరమెరి మండల కేంద్రంలో మాలి సంఘం ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, తిరుపతి, యూనుస్, ఇష్తేకార్ తదితరులు పాల్గొన్నా రు. వాంకిడి మండల కేంద్రంలో జ్యోతిబాపూలే విగ్రహానికి, మాలి, అంబేద్కర్ సంఘం పూల మాలలు వేసి నివాళులు అర్పిచారు. కార్యక్రమంలో నారాయణ, అశోక్, వాసు, సందీప్, మెంగాజీ, బాబురావు, దుర్గాజీ, జయరాం, ప్రశాంత్, రోషన్, రాజేశ్వర్, అరుణ్, నాగసేన్ తదితరులు పాల్గొన్నారు. రెబ్బెన మండలం కొండపల్లి గ్రామంలో జ్యోతిబాపూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యకరమంలో పూలే సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుపతి, మాలి కులస్తులు పాల్గొన్నారు.